# 'అమ్మ' అంటే యేవిటి మమ్మీ?



వూరి శివార్లుదాటి, 'రిజర్వు ఫారెస్ట్'ని పేరు పెట్టుకున్న ముళ్లపొదల మధ్య వోపదిహేను నిముషాలు పరిగెత్తి, 'లిటిల్ యేంజిల్స్ పబ్లిక్ స్కూల్' ప్రాంగణంలోకి ప్రవేశించింది నీలిరంగు అంబాసిడర్ కారు.

సమావేశమైన గ్రద్దల్లా నిల్చున్న కార్ల వరసకు పక్కనే తమ కారునూ పార్కు చేసిన తరువాత, కిందికి దిగి బాక్‌డోరు తెరిచాడు డ్రైవరు. ప్లాస్టిక్ సంచిని చేతికందుకుని కిందికి దిగింది కృష్ణవేణి.

విసురుగా వీస్తున్న కొండగాలి తాకిడికి రంగురంగుల బానర్లు వూగిపోతున్నాయి.

కొత్తగా వెల్లవేసుకున్నట్టు స్పష్టంగా తెలియజేస్తున్న అసంపూర్ణ భవనాలు అనుకోని అతిథుల రాకతో నిర్ఘాంతపడిపోయినట్టు కనిపిస్తున్నాయి.

విశాలమైన పబ్లిక్ స్కూలు ప్రాంగణంలో, కొత్తగా వేసిన మట్టిబాటల పైన, జనసంచారం మొదలైపోయింది. బాటల కిరువైపులా వెదురు బుట్టల్లోంచీ యూకలిప్టస చెట్ల చిగుర్లు తలలెగరేస్తున్నాయి.

అప్పుడే రంగురంగుల దీపాలను అలంకరించుకున్న వోపెనేర్ స్టేజీ చీకటి పడకముందే రంగస్థలం పైకి అడుగు పెట్టిన రికార్డు డాన్సరులా అదోలా, యెబ్బెట్టుగా కనిపిస్తోంది.


"బాగ్ నేను తీసుకురానా మేడమ్?" ముందుకు వంగి, తెచ్చిపెట్టుకున్న వినయంతో అడుగుతున్నాడు డ్రైవరు.

"వొద్దొద్దు...నేనే తీసుకెళ్తాను. నువ్విక్కడే వుండు..." అంటూ ముందుకు కదిలింది కృష్ణవేణి. కట్టుకున్న పట్టుచీర పరపరమని కర్కశంగా శబ్దం చేయడంతో, విసుగ్గా ముఖం చిట్లించుకుని వొక యూకలిప్టస్ మొక్క పక్కనే ఆగిపోయింది.

ఆ ప్రదేశం పట్టణం నుంచీ బాగా యెత్తులో వుంది. రెండు మూడు కొండల మధ్య విశాలంగా పరచుకున్న పల్లపు భూమిని యెన్నుకుని, అడవిని తీర్చి యిప్పుడిప్పుడే నివాసయోగ్యంగా తయారుచేస్తున్నారు. యినుప తీగలకంచెకవతలి నుంచి యింకా అరణ్యం పొంచి చూస్తోంది. కొత్తగా నాటిన విద్యుత్తీగల స్తంభాలు పహరా కాస్తున్న సైనికుల్లా హుందాగా నిల్చున్నాయి. దూరంగా

తగ్గు ప్రాంతంలో పట్టణం తాలూకు యిండ్లు అగ్గిపెట్టెల బొమ్మల్లా కనిపిస్తున్నాయి. పట్టణం చివర్లోని చెరువు విరిగిన అద్దంముక్కలా ఆకాశాన్ని ప్రతిఫలిస్తోంది.

పబ్లిక్ స్కూలు భవనాల చుట్టూ యూనిఫారాలు ధరించిన పిల్లలూ, బాడ్జీలు తగిలించుకున్న యువతీ యువకులూ హడావుడిగా తిరుగుతున్నారు. షామియానా




కింద కూర్చున్న అతిథులందరూ కూల్ డ్రింక్స్ తాగుతున్నారు.

చుట్టూ వెలకొన్న అలజడీ, హడావుడీ తన ఒంటరితనాన్ని మరింత ప్రగాఢ పరచినట్టుగా అనిపించింది కృష్ణవేణికి. ప్రేమతో పైకుబికిన భూమీ, అనురాగంతో కిందికి వంగిన ఆకాశమూ, రెండు తప్పెట తాళాల్లా తయారై తనను నలిపిపారేస్తున్నట్టుగా తోచింది ఆమెకు. ఈ ఒంటరితనాన్ని భరించలేనని ఆమెకు తెలుసు. అందుకే "మీరూ రాగూడదూ?" అంటూ భర్తని పిలిచింది. అతగాడి అనుగ్రహం పొందడంకోసం "బేబీ వెయిట్ చేస్తూవుంటుంది" అంటూ పొడిగించింది.

"సారీ డియర్! అయ్ హేవ్ టు గో టు హైదరాబాద్. యిటీజే డీల్ ఆఫ్ యింపార్టెన్స్. యూ కెన్ గో అండ్ మీట్ ది బేబీ. కన్వే మై బెస్ట్ విషెస్...డోన్ట్ ఫర్గెట్ టూ టేక్ రెడీమేడ్ డ్రెస్ అండ్ స్వీట్స్..." ఆమెవైపుకయినా తిరగకుండా బూట్లు టకటకలాడిస్తూ వెళ్ళిపోయాడు భాస్కర్. యిక ఆ మాటలకు తిరుగు లేదు.

తన అత్తగారినయినా తోడు తీసుకురావడానికి వీలుకలగలేదు. ఆవిడైతే యీ వాతావరణంలో చక్కగా యిమిడిపోయి వుండేది. అంగుళం మందం పౌడరురాసుకుని, సెంటుపూసుకుని, స్లీవ్‌లెస్ బ్లౌజు తొడుక్కుని, లిప్‌స్టిక్ దట్టించి, తెలుగునుసైతం యింగ్లీషుగా మార్చిపారేస్తూ, పొరబాటున ఆంధ్రదేశంలోకి వూడి పడిన అమెరికా నివాసిని లా క్షణాల్లో అందరినీ హడలుగొట్టి పారేసి వుండేది. పైగా పాపాయికి గూడా ఆమెదగ్గరే చనువెక్కువ. పాపాయిని కిందికి దించేది గాదు ఆవిడ. పాప 'మమ్మీ' అని పిలవడానికంటే ముందుగా 'గ్రానీ' అని పిలవడం నేర్చుకుంది. కానీ సమయానికి 'బి.పీ. కండీషన్ బాగాలేద'ని డాక్టరు పడక కదలనివ్వలేదు. మామగారు యేదో కాంట్రాక్టుపని మీద హైదరాబాదు వెళ్లి వారం రోజులు కావస్తోంది.

"గుడీవినింగ్ మేడమ్! వుయార్ యెక్స్‌పెక్టింగ్ మిసెస్ రంగనాథ్..." తెల్లటి పట్టుచీరమీని యెర్రటి బ్యాడ్జీతో పెదవుల లిప్‌స్టిక్ పోటీ పడుతుండగా, వో పొలికేళ్ళ అమ్మాయి పలకరిస్తోంది.

"ఆమె ఆరోగ్యం......" కృష్ణవేణి బిక్కుబిక్కుమని చూడసాగింది.

"యువార్ వెల్‌కమ్‌టు అవర్ స్కూల్‌డే ఫంక్షన్...కమాన్, లెట్ అజ్ గోటుది విజిటర్స్ సర్కిల్ అండ్ హేవ్ యువర్ డ్రింక్...మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్..." తన ప్రశ్నకు సమాధానం వచ్చి తీరాలన్న నిబంధనేమీ లేనట్టుగా బట్టీపట్టిన వాక్య సముదాయాల్ని వెలిగక్కుతూ గబగబా ముందుకు సాగిపోతోంది ఆమె.

కృష్ణవేణి షామియానా దగ్గరికొచ్చి కూర్చొంది. వో యువకుడు 'లిమ్కా' అందించాడు. "మా అమ్మాయి..." అంటూ తనను ఆహ్వానించిన అమ్మాయికేసి తిరిగి చూసింది ఆమె.

జ్యోత్స్న...షి యీజ్ యిన్‌ది గ్రీన్ రూం...".

"జ్యోత్స్న గాదండీ... మా అమ్మాయి కావ్య..."

"హో కావ్యా? షీ యీజ్ ఆల్‌సో యిన్‌ది గ్రీన్ రూం... వియ్‌విల్ యిన్ఫార్మ్ హర్..." ఆమె వెళ్లిపోయింది.

చల్లటి లిమ్కా గొంతు దిగుతుండగా చుట్టూ పరికించింది కృష్ణవేణి.

దాదాపుగా కుర్చీలన్నీ నిండిపోయాయి. ఖరీదైన పట్టు చీరలు, కళ్ళు జిగేల్మంటున్న టెరీకాటన్ దుస్తులు, ఇద్దరు ధోవతులు—'యిండియాలో యెక్కువ శాతం మంది దారిద్ర్యరేఖకులోపే జీవిస్తున్నారన్న విషయాన్ని యీ దృశ్యం చూసినవాడెప్పుడూ చస్తే నమ్మడు' అనుకొంది కృష్ణవేణి.

సూర్యుడు కొండల కిందికి జారుకున్నా ఆకాశం అరుణిమను వదులుకోలేదు.

దూరంగా తెల్లటి దుస్తులు తొడుక్కున్న పిల్లలు కొందరు కిన్నెరల గుంపులా మెట్లో వెళ్తున్నారు.

"మమ్మీ!" వెనుకనుంచీ రెండు చిన్నారి చేతులు ఆమెను అల్లుకున్నాయి.

"నా బంగారు తల్లీ!" అలాగే పాపను వొళ్లోకి లాక్కుంది ఆమె.

ముఖానికి రోజారంగు చమ్కీ, కళ్లకు తీర్చి దిద్దిన కాటుక, చెవులకు పెద్ద పెద్ద. లోలాకులు, తలలో రంగురంగుల యీకలు, తెల్లటి గౌను, తెల్లటి గాజులు, కాళ్లకు తెల్లటి సాక్సులూ, తెల్లటి బూట్లూ— "యేం వేషం వేస్తున్నావు తల్లీ!" రంగు చీరకంటుకుంటుందేమోనని కంగారు పడుతూ అడిగింది కృష్ణవేణి.

"బేబీ యిన్ ది డ్రామా..."

పాప కళ్లు చుట్టూ కలయజూస్తున్నాయి.

"డాడీ రాలేదు బుజ్జాయ్... హైదరాబాదుకెళ్లారు. నీకోసం యీ డ్రస్సూ, స్వీట్సూ పంపారు. గ్రానీకి ఆరోగ్యం సరిగా లేదు."

భావమేమిటో అర్థం గాని మూపుల్ని సారించుతూ "మమ్మీ, మమ్మీ, అయ్ గాటింగ్ యెయిత్ రాంక్" అంది కావ్య.

"గాటింగ్ అనగూడదురా కవీ! అయ్ గాట్ ది యెయిత్ రాంక్— అనాలి" కృష్ణవేణి చిరునవ్వు నవ్వింది.

"యువర్ బేబీ యీజ్ యె వెక్స్ట్రీమ్లీ యింటలెక్చువల్ స్టూడెంట్ మామ్..."

తిరిగి చూసింది కృష్ణవేణి.

పాపను వెంటబెట్టుకుని వచ్చిన బ్యాడ్జీధారిణి లిప్స్టిక్‌తో అతుక్కుపోయిన పెదవుల్ని బలవంతంగా సాగదీస్తోంది. 'మాల్‌ప్రాపిజమ్-అంటే యేమిటో తెలుసా నీకు?' అన్న ప్రశ్న కృష్ణవేణి పెదవుల దాకా వచ్చింది. కానీ ఆమెకు మాట్లాడే అవకాశం కలుగలేదు. బ్యాడ్జీ ధారిణి కనురెప్పలు టపటపలాడిస్తూ, పలవరిస్తున్నట్టుగా చెప్పుకుపోతూనే వుంది— "షీయీజ్ ఆల్వేస్ వన్ అమాంగ్ ది టాపర్స్ ఆఫ్ ది క్లాస్. షీ యీజ్ వెరీ యాక్టివ్ యిన్ గేమ్స్... షీ యీజ్ ఆల్సో యే గుడ్ సాంగర్... షీ గాట్ టూ ప్రయిజెస్ ఆల్సో యిన్ ది కాంపిటీషన్స్, వన్ యిన్ మ్యూజికల్ చేర్స్, వన్‌యిన్ మ్యూజిక్... మోర్‌వోవర్, షి గాట్ ట్రెమండస్ పవర్ ఆఫ్ ఆక్టింగ్. షీ యీజ్ పార్టిసిపేటెడ్ యిన్ ది డ్రామా... యువార్ గోయింగ్ టు విట్‌నెస్ యిట్. నవ్... కమాన్ బేబీ, సింగ్ దట్ ఫేవరెట్ సాంగ్ ఆఫ్ యూ... కమాన్, హరియప్..."

యేం చేయాలో తోచకపోవడంతో, బిక్కమొగం పెట్టుకుని తన తల్లినీ, తన మేడమ్‌నూ మార్చి మార్చి చూడసాగింది కావ్య.

"యువర్ సన్ యీజ్యె బ్రైట్ స్టూడెంట్ సార్! హీయీజ్ ఆల్వేస్ యాక్టివ్... ఫస్ట్ యిన్ ది క్లాస్ రూం..." అవతలి వైపు కూర్చున్న దంపతులకు వాళ్లబ్బాయిని తీసుకొచ్చి అప్పగించి, తన రిపోర్టును చెప్పుకుపోతున్నాడో యువకుడు.

కృష్ణవేణి పెదవులపైకి అప్రయత్నంగా వొక నవ్వొచ్చి కూర్చుంది. 'నువ్వేమంటావన్నట్టు'గా కావ్యను తీసుకొచ్చిన అమ్మాయికేసి చూసింది. స్విచ్ నొక్కినట్టుగా ఆమె పెదవులు మళ్లీ కదిలాయి. "షీ యీజ్ వెరీ ప్రాంప్ట్ యిన్ హర్ హోంవర్క్. హావ్ యు సీన్ హర్ ప్రోగెస్ రిపోర్ట్? షీ గాట్ యెయిత్ రాంక్..."

"చూశాను. చూశాను. మీరంతా పాపం చాలా బిజీగా వున్నట్టున్నారు. మీరు వెళ్ళి మీ పనులు చూసుకోండి" చికాకును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించింది కృష్ణవేణి.


"నో మేడమ్! యిటీజ్యె ప్లెజర్ టు బీ విత్ యూ"

"పరవాలేదు, మీరు వెళ్లండి."

ఆ అమ్మాయి వులిక్కిపడి, యెవరో తరుముతున్నట్టుగా వెళ్లిపోతున్నప్పుడుగానీ, తాను దగ్గరగా తేకేశానన్న సంగతి కృష్ణవేణికి అర్థం కాలేదు.

## సౌరశక్తి రేడియోలు

సంగీతప్రియులు తమ రేడియోలకు బ్యాటరీలు కొనుక్కోవలసిన అవసరం ఇక వుండదు. పశ్చిమ జర్మనీలోని ఏ.ఇ.జి. టెలి ఫంకెన్ సంస్థ సౌరశక్తితో పనిచేసే రేడియోలను తయారుచేసింది. ఇందులో సిలికాన్ సోలార్ సెల్స్ సౌరశక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తాయి. ఈ రేడియోలు పోస్టు కార్డు సైజులో వుంటాయి. రేడియోలతోపాటు వాక్‌మన్, కేసెట్ రికార్డర్లు, రేడియో ట్రాన్సిస్టర్లు, కెమెరాలు కూడా ఈ సంస్థ తయారుచేసింది. (గ్లోబల్)



"మనం అలా వెళ్లి కూచుందాం కవీ..." అంటూ పాపను వాళ్లోనుంచీ లేవదీసి, పాకెట్లు చేతికెత్తుకుని, సందడి తక్కువగా వున్న వైపుకు నడచింది ఆమె. పాకెట్లను వో కుర్చీలో పడేసి, పాపను మళ్లీ వొళ్లోకెత్తుకుని, "యిప్పుడు చెప్పవే తల్లీ! రోజూ పడుకోబోయే ముందు మరచిపోకుండా పాలు తాగుతున్నావా?" అంటూ ప్రశ్నించింది.

"యస్ మమ్మీ... అయామ్ డ్రింకింగ్ బోర్నీటా..."

"నీ యింగ్లీసు బ్రహ్మాండంగానే వుంది గానీ తెలుగులో యేడువ్..." కసురుకుంది కృష్ణవేణి.

"వోమమ్మీ..." పాప యేడుపు ముఖం పెట్టింది. "మా మిస్ చూస్తే స్కోల్డింగ్..."

"మరేం పర్వాలేదులే...నేను చెబుతున్నానుగా! నాతోనయినా తెలుగులోమాటాడు. నీ బట్టలన్నీ జాగ్రత్తగా పెట్టుకున్నావా?"

"మా మిస్ బాక్సులో తీసి పెట్టింది..."

"తాతయ్యకు వుత్తరాలు రాస్తున్నావా?"

"వో...బట్ మమ్మీ..."

"......"

"గ్రాండ్‌పా యెప్పుడూ తెలుగే రాస్తాడు..."

"రాస్తాడు అనగూడదమ్మా, రాస్తారు అనాలి..."

"రాస్తారు మమ్మీ..."

"రాస్తే యేం?"

"మా మిస్ అయితే...గ్రాండ్‌పాకు యింగ్లీషు రాదా అని..."

"మవ్వేం చెప్పావ్?..."

"......"

"మవ్వు రిప్లయి యింగ్లీషులోనే గదూ రాస్తావ్?"

"యా మమ్మీ...మా మిస్ కాపీ రైటింగ్ ప్రాక్టీస్ చేయించాక, డిక్టేషన్ చెప్పి ప్రాక్టీసు చేయిస్తుంది..."

"మవ్వు రాసిన వుత్తరాలకు రిప్లయి వస్తోంది గదా! అంటే తాతయ్యకు యింగ్లీషువచ్చేగదా అర్థం?"

కావ్య కళ్లు తిప్పుతూ తలాడించింది.

తన తండ్రికి యింగ్లీషు బాగా వచ్చనీ, షేక్స్‌పియర్ నాటకాలు ఆయనకు ప్రాణంతో సమానమని 'హామ్లెట్' స్వగతాలు ఆయనకు కంఠస్థమనీ చెప్పాలని వుంది కృష్ణవేణికి. లోటి తెలుగువాడితోసైతం యింగ్లీషులో మాట్లాడే జాడ్యాన్ని ఆయన చీదరించుకుంటాడని కూడా చెప్పాలని వుంది. అయితే అయిదారేళ్ల పసిపిల్లకీ విషయాల్ని యెలా విడమరిచి చెప్పాలో ఆమెకు అర్థం గావడం లేదు.

"తెలుగు యెంతవరకూ నేర్చుకున్నావు?" అని అడిగింది.

"అ,ఆలు కంప్లీట్ చేశాను"

"హల్లులూ?..."

"!?!"

"క ఖ లూ..."

"చ వరకూ"

"యింకా పదాలు దాకా రాలేదా?"

"వూహూ"

"యింగ్లీషు..."

## రోడ్డుపై క్రీస్తు

రొద చేస్తో వాహనాలు రోడ్డుపై
కదచి పోతాయి
రోడ్డు కిరువేపులా సాచిన
ఫుట్‌పాథ్ చేతుల్లో ఒదిగి
ఎన్ని జీవితాలో
నీడనిచ్చే కొద్ది జాగా
వెతుక్కొంటాయి.

ఫుట్‌పాత్ పై ఇమిడిన జీవన చిత్రం
రోడ్డు పై గీసిన క్రీస్తుబొమ్మలాంటిది.
రక్తసిక్త దేహాల క్షతగాత్రులూ,
శిలవేయబడిన శిలామూర్తులీ
ఫుట్‌పాత్ వాసులు.

మరో బొమ్మ ఇదే స్థానే
ఇదే బొమ్మ మరో స్థానే
పునరుత్థాన మౌతాయి.
ఐతే, మర్నాటికి స్మృతికూడా
మిగులకుండా శిథిలమై,
చెరిగిపోతాయి.

—ఎస్.ఎ. రవూఫ్

"థర్డ్ రీడరు కంప్లీటెడ్..."

"అలాగా! పిల్లలంతా హాస్టల్లో యింగ్లీషులోనే మాట్లాడుకుంటారా?"

"యా మమ్మీ! తెలుగులో మాట్లాడితే మిస్ యింపోజిషన్ రాయమంటుంది...."

కృష్ణవేణి కాస్సేపు మౌనంగా వుండిపోయింది.

"ప్లీజ్ సెండ్ బేబీ టుది గ్రీన్ రూం మేడమ్...అవర్ ప్రిన్సిపాల్ యీజ్ కమింగ్... హి విల్ షో యూ ది స్కూల్..." ముఖాన్ని మళ్లీ వోసారి కడుక్కుని, పెదవులకు మరింత లిప్‌స్టిక్ పట్టించుకొని మళ్లీ రంగ ప్రవేశం చేసింది బ్యాడ్జీధారిణి. అవతలివైపున, తల్లిదండ్రుల దగ్గర కూచున్న పిల్లల్ని సైతం వెంటబెట్టుకుని, "హారీ అప్ చిల్డ్రన్...గో టు ది గ్రీన్ రూం" అంటూ చిలక పలుకుల్ని వల్లిస్తూ వెళ్లిపోయింది.

అతిథులందరికీ తనను పరిచయస్తుడిలా భావించుకున్న యువకుడొకడు "హీ యీజ్ అవర్ ప్రిన్సిపాల్ కమ్ కరస్పాండెంట్-మిస్టర్ పి.లోకప్రకాష్...యెమ్మే, డిప్ యిన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిప్ యిన్ గుడ్ యింగ్లీషు..." అంటూ తమ ప్రిన్సిపాల్‌ను పరిచయం చేసుకుంటూ ముందుకొస్తున్నాడు.

మిస్టర్ పి.లోకప్రకాష్, యెమ్మే, డిప్ యిన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిప్ యిన్ గుడ్ యింగ్లీష్, దాదాపు ముప్ఫయి అయిదేళ్లవ్యక్తి. పొడవాటి జుట్టు.. బాగా కిందికి దిగి మీసాలతో కలిసిపోయిన సైడ్‌లాక్సూ...ముఖుకంపైన మాత్రం చిరుగడ్డం... కళ్లకు నీలిరంగు కూలింగ్ గ్లాసూ... నల్లసూటు తొడుక్కున్నాడు. కోటుపైన ఎరుపు రంగు బ్యాడ్జీ.......

"హలో సార్! యూ హావ్ ప్రామిస్డ్ మీ దట్ యూవిల్ అరేంజి ఏన్ ఇంటర్వ్యూ ఫార్ మీ విత్ ది మినిస్టర్. ఐ యామ్ వెరీ క్యూరియస్ ఆఫ్ యిట్...వోకే వోకే... థాంక్స్ యే లాట్... హలో రంగస్వామిగారూ, గుడీవినింగ్ సార్! యువార్ వెరీ కైండ్ ఫుల్ టు అప్...దట్ యూ యీ కేమ్ హియర్ అండ్ శాంక్షన్డ్ దీ నీడ్ ఫుల్...గుడీవినింగ్ ప్రసాదరావ్ సార్! వెల్‌కంటు అవర్ టినీ స్కూల్...అయ్ హోప్ యెవరిథింగ్ యీజ్ వెరీ ఆల్‌రయిట్...హోప్ యూ టేకన్ ది డ్రింక్...యువర్ ఛైల్డ్ యీజ్ వెరీ యింటలిజెంట్...టుటెల్ యు ది ట్రూత్-ఆలాఫ్ అవర్ స్టూడెంట్స్ ఆల్‌రియల్ జెమ్స్... వియార్ షేపింగ్ దెమ్...అవర్ స్టాఫ్ యీజ్ వెరీ సెలెక్టెడ్ వన్......"

ప్రతివ్యక్తినీ పలకరించుతూ అతగాడు కృష్ణవేణి వైపుకు గూడా వచ్చేశాడు.

"నమస్తే మేడమ్...అయ్ థింక్ యూ ఆర్..."

"నేను కావ్య తల్లినండీ" కృష్ణవేణి ప్రతి నమస్కారం చేసింది.

"అయ్‌వో అయ్‌వో...వేరీజ్ యువర్ హస్బెండ్ మిస్టర్ మురళీ..."

"మా ఆయన పేరు భాస్కర్" ఆమె అడ్డు తగిలింది.

"అయ్‌వో, అయ్‌వో...వేరీజ్ హీ... హీ యీజ్ యే గుడ్ జెంటిల్ మాన్... హీ హేజ్ డొనేటెడ్ లిబరలీ..."

"ఆయనకు తీరిక దొరకలేదు. నేనొక్కదాన్నే వచ్చాను!"

"యిటీజ్ ఆల్‌రయిట్...బట్ వుయ్ హావ్ యెక్స్‌పెక్టెడ్ దట్ యువర్ బెటర్ హాఫ్ విల్..."

కృష్ణవేణి ఫక్కున నవ్వేసింది.

ఆమె నవ్వుతున్నదెందుకో అర్థంగాకపోవడంతో ప్రిన్సిపాల్ కాస్సేపు విభ్రాంతపడిపోయి నిల్చుండిపోయాడు. అంతలోనే తేరుకుని, తామగూడ నవ్వుతూ "కమాన్ మేడమ్; అవర్ ఫస్ట్ డ్యూ యీజ్ టు షోది స్కూల్ ప్రెమిసెస్ టు గెస్ట్స్..." అంటూ ముందుకు కదిలాడు.

దాదాపు ముప్ఫయి, నలభైమంది అతిథులందరు వెంటరాగా పబ్లిక్ స్కూలు ప్రాంగణమంతా తి చూపించాడు అతను. దాదాపు యాభై యెకరా ప్రాంతం అది. ప్రభుత్వం తక్కువ ధరకే మంజూ చేసింది. పట్టణంలోని ధనికులందరూ డొనేష యిచ్చారు. రెండు సంవత్సరాల క్రితం యెవ

మంత్రిగారు శంఖుస్థాపన చేశారు. వెంటనే పని ప్రారంభమైంది. ఆరునెలలకంతా అత్యవసరంగా కావలసిన మూడు, నాలుగు భవనాలు నిర్మించబడ్డాయి. బోరింగు పైపు వేయడంతో నీటి సమస్య తీరింది. యేడాది క్రితమే మొదటి బాచ్‌ని చేర్చుకున్నారు.

"మెట్ వుయ్ వాంట్ సమ్మోర్ ఫెసిలిటీస్ సార్... టూ మోర్ బిల్డింగ్స్ ఆర్ యిన్ నీడ్...వన్ మెస్ యీజ్ టు బి కన్‌స్ట్రక్టెడ్...దెన్..." మీసాలూ, సైడ్ లాక్సూ, గడ్డమూ, మూడు వైపులనుంచీ పరిహద్దుల్ని నిర్ణయించినా, అతడి పెదవులు దురాక్రమణకు పూనుకున్నట్టుగా, చిత్ర విచిత్రమైన హావభావాల్ని ప్రకటిస్తున్నాయి.

"బట్ సార్... అయ్ హావ్ బీన్ స్ట్రగులింగ్ హియర్ ఫ్రం టూ యియర్స్...అయ్‌హావ్ నెగ్లెక్టెడ్ మై ఫామిలీ...అయ్‌హావ్ రిక్వెస్టెడ్ మై వైఫ్ టూ కమ్ హియర్ అండ్ టేక్ ఛార్జ్ యాజే వార్డెన్...ఫ్రందట్ ఆన్వర్డ్స్ షీ యీజ్ లుకింగ్ ఆఫ్టర్ యిట్...వుయ్ హావ్ అపాయింటెడ్ థర్టీ టీచర్స్... టెన్ స్టేవార్డ్స్...అదర్ స్టాఫ్ యీజ్ అనదర్ ట్వంటీ...టోటలీ సిక్స్టీ త్రీ మెంబర్స్ ఆర్ స్ట్రగులింగ్ హియర్...వుయ్ హావ్ టు కన్‌స్ట్రక్ట్ క్వార్టర్స్ సర్ ది స్టాఫ్... అయ్‌హావ్ యిన్వెస్టెడ్ సమ్‌లాక్స్ ఆఫ్ మనీ...యెట్ సమ్ లాక్స్ ఆఫ్ మనీ యీజ్ నీడెడ్...యూమస్ట్ అండర్‌స్టాండ్ మై పొజిషన్. విథవుట్ యువర్ హెల్ప్ అయ్ కాన్ట్ ప్రొసీడ్ ఫరదర్... యిఫ్ అయివుడ్ హావ్ స్టార్టెడ్ యేన్ యూకలిప్టస్ నర్సరీ, హియర్ యిన్ దిస్ ఫిఫ్టీ యేకర్స్, అయ్‌వుడ్ హావ్ యెర్న్ మిలియన్స్. బట్ నవ్ అయామ్ స్టాండింగ్ విత్ యెమ్టీ హాండ్స్..."

అతిథులందరూ అతడి బాధ తమ కర్థమైందన్నట్టుగా తలలూపుతూ, సానుభూతిని వెల్లడించారు.

యింతలో వో యువకుడు "సార్ సార్! చీఫ్ గెస్ట్ యీజ్ అరైవుడ్..." అంటూ పరిగెత్తుకొచ్చాడు.

"థాంక్ గాడ్...అయామ్ వెరీ మచ్ వర్రీడ్ అబౌట్ హిస్ అరైవల్... స్టిల్ అయ్‌హావ్ టు యింటర్‌డ్యూస్ మై స్టాఫ్ టూయూ... బట్ దేరీజ్ నో టైమ్...యూమస్ట్ యెక్స్‌క్యూజ్ మీ...వన్‌మాన్ హేజ్‌టూ లుక్ ఆఫ్టర్ ఆల్ ది డ్యూటీస్..." మాట్లాడుకుంటూనే అతగాడు సెలవు తీసుకున్నాడు.

మళ్ళీ షామియాన క్రింద కూర్చున్నారు అందరూ.

బాగా చీకటి పడిపోయింది.

ఆకాశంలో అక్కడక్కడా తారకలు మెరుస్తున్నాయి..

దూరంగా పట్టణం మాత్రం వేలకొద్ది విద్యుద్దీపాలతో ఆకాశాన్ని వెక్కిరిస్తోంది.

మెల్లమెల్లగా కొండగాలి వీవనలు వీస్తోంది.

అతిథులందరికీ కాఫీలు సరఫరా చేయబడ్డాయి.

తన దగ్గరికి కాఫీ తీసుకొచ్చిన యువతిని "వీళ్ళందరూ మీ స్టాఫేనా?" అని అడిగింది కృష్ణవేణి, అతిథి మర్యాదలు చేస్తున్న యువతీ యువకుల్ని చూపెడుతూ.

"యస్ మేడమ్...అవర్ ప్రిన్సిపాల్ యిజ్యే జీనియస్...హీ హేజ్ సెలెక్టడ్..."

"యింతకూ మీకు జీతమెంత యిస్తున్నారు?" విసుగ్గా అడ్డుతగిలింది ఆమె.

"హండ్రెడ్ సిక్స్టీ, విత్ బోర్డింగ్ అండ్ లాడ్జింగ్..."

"యిటీజ్ ఆల్‌రయిట్...యూకెన్ గో అండ్ అటెండ్ టు యువర్ డ్యూటీ..."— గంటసేపు గడవీ గడవక ముందే తనకు సైతం యీ జాడ్యం అంటుకున్నట్టుందని, చిరాకు పడుతూ నవ్వుకొంది కృష్ణవేణి.

కాఫీలందిస్తున్న స్టాఫ్ నందరినీ కేకేసి, "మీకిచ్చే జీతం మీ బట్టలకయినా సరిపోతోందా? మీరు కట్టుకున్న పట్టు చీరలు యెవరి దగ్గర అరువు తెచ్చుకున్నని? అంత నాసిరకం లిప్‌స్టిక్ రాయకపోతే, కొంచెం ఖరీదయినదే కొనుక్కోగూడదూ?" అంటూ కడిగిపారేయాలనిపించింది ఆమెకు. అంతలోనే, 'అయ్యో పాపం! యింత చిన్న జీతాలకే జీవితాల్ని అమ్ముడు జేసుకున్న వీళ్ల పరిస్థితులెలా వుండి వుంటాయో! చేస్తున్న వూడిగానికి తోడు కరెస్పాండెంటుగారిని పొగడాలి కూడాను!' అనుకొని జాలి పడిపోయింది.

"అవర్ ప్రిన్సిపాల్ యీజ్ షోయింగ్ పబ్లిక్ స్కూల్ టుది చీఫ్ గెస్ట్...యుకెన్‌గో అండ్ సిట్ నియర్ ది స్టేజ్..." యువకుడొకడు కృష్ణవేణికి సమాచారాన్నందజేశాడు.

ఆమె స్టేజీదగ్గరికెళ్ళి, అతిథులకై కేటాయించిన భాగంలోని వో కుర్చీలో కూర్చొంది.

కుర్చీలన్నీ మెల్ల మెల్లగా నిండసాగాయి.

స్టేజీ పైన తెరలు యెందుకో కాస్సేపు తెరచుకుని, మరి కాస్సేపు మూసుకుని, అసలు 'ప్రోగ్రాం' ప్రారంభం కాకమునుపే ప్రేక్షకుల్ని ఆనందపరచసాగాయి.

'యిదిగో మేమూ వున్నామండోయ్' అంటూ 'మైక్'లు అదేపనిగా తమను తాము పరీక్షించుకోసాగాయి.

అరగంట తరువాత ప్రిన్సిపాల్ మైక్ ముందుకొచ్చి ముఖ్య అతిథుల్ని స్టేజీ పైకి ఆహ్వానించాడు. వొక యెమ్మెల్యే, వొక అయ్యేయెస్ ఆఫీసరూ, వొక పారిశ్రామికవేత్తా, కుర్చీలను అలంకరించిన తరువాత "నౌ అయామ్ వెరీమచ్ డిలైటెడ్ టు యిన్వయిట్ ది స్పీకర్ ఆఫ్ ది యీవెనింగ్ — ప్రొఫెసర్ కరుణాకర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటాఫ్ యింగ్లీష్, యూనివర్సిటీ..." అంటూ తానే ముందుగా చప్పట్లు కొట్టసాగాడు ప్రిన్సిపాల్.

"యిదేమిటి? మా ప్రొఫెసర్‌గారేనా చీఫ్ గెస్ట్" కృష్ణవేణి ఆశ్చర్యపడిపోయింది.

ముగ్గురు పిల్లల 'ప్రేయర్'తో కార్యక్రమం ప్రారంభమైపోయింది. ప్రిన్సిపాల్ అతిథుల్ని పేరు పేరునా పరిచయం చేశాడు. తరువాత, వో గంటసేపు రిపోర్టు చదివాడు. పారిశ్రామికవేత్తను 'డొనేషను'



కోసం స్టేజీ పైనే కాళ్లుపట్టుకునేటంతటి పని చేశాడు. కొన్ని విషయాల్ని మనవిజేసుకున్న తరువాత, యెమ్మెల్యేగారు వాగ్దానాల వాన కురిపించారు. పారిశ్రామికవేత్త యేదో మాట్లాడబోయి, మరేదో మాట్లాడి, యీటని తనది కాదన్నట్టుగా కుర్చీలోకి చతికిలబడిపోయాడు.

కృష్ణవేణి మాత్రం జరుగుతున్న తతంగంపైన తన దృష్టిని కేంద్రీకరించలేకపోయింది. ప్రొఫెసరుగారిని చూడగానే, ఆమెకు తన విద్యార్థి జీవితం జ్ఞాపకం వచ్చింది. క్లాస్ రూమూ, తన తోడి విద్యార్థులూ, హాస్టలూ, తన రూమ్మేటూ, స్నేహితులూ, సినిమాలూ, పరీక్షలూ—అన్నీ వొకదాని వెంట వొకటిగా జ్ఞాపకంవచ్చాయి. ప్రొఫెసరుగారి పాఠాన్ని తానెలా వొళ్లు మరిచిపోయి వినేదో జ్ఞాపకం వచ్చింది. తరగతిలో యెంతో బుద్ధిమంతురాలిగా పేరుతెచ్చుకున్న తాను, ప్రొఫెసరుగారి దగ్గర చీవాట్లు తిన్న రోజున యెలా కుమిలి కుమిలి ఏడ్చిందో జ్ఞాపకం రావడంతో బాధగా నిట్టూర్చింది. ఆ రోజుల్లో యింజనీరింగ్ స్టూడెంటొకడు ఆమె వెనకపడి తిరుగుతూ వుండేవాడు. రోజూ వో ప్రేమ లేఖ రాసి పోస్టులో పడేసేవాడు. యెంతకూ ఆమె తొణక్కపోయేసరికి, గెడ్డం పెంచుకునే తిరగసాగాడు. వొక రోజున యెవరూలేని సమయం చూసి, ఆమె చేయిపట్టుకున్నాడు. ఆమె బిగ్గరగా కేకేసింది. స్టూడెంట్లందరూ పోగయ్యారు. ఆమె క్లాసులోని కుర్రాళ్లు అతగాడి దుమ్ము దులిపారు. యీ విషయం ప్రొఫెసరుగారి చెవినబడింది. ఆ వేళ ఆయన పెట్టిన చీవాట్లతో ఆమె ముఖం వాచిపోయింది.

ప్రొఫెసరుగారు తన ప్రధానోపన్యాసాన్ని కొనసాగిస్తున్నారు. పబ్లిక్ స్కూళ్లన్నవి యెక్కడ, యెలా ప్రారంభమయ్యాయో, వాటి వుద్దేశమేమిటో అసలు విద్య అంటే యేమిటో-ఆయన వరుసగా చెప్పుకుపోతున్నారు. చక్కని నుడికారంతో కూడిన ఆయన వుపన్యాసాన్ని వినడంతో కృష్ణవేణికి వొయాసిస్సులో సేద తీరినట్టుగా వూరట చేకూరింది. చివరగా మాతృభాష కివ్వవలసిన ప్రముఖ స్థానాన్ని వోసారి గుర్తుకు తెచ్చి, ఆయన తన వుపన్యాసాన్ని ముగించేశాడు.

అయ్యేయెస్ ఆఫీసరుగారు బహుమతి ప్రదానం గావించిన తరువాత వినోద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ప్రొఫెసరుగారి కోసం చుట్టూ కలయజూసింది కృష్ణవేణి.

వొకవైపు పారిశ్రామికవేత్తనూ , మరోవైపు యెమ్మెల్యేనూ కూచోబెట్టుకుని, యిద్దరితోనూ వొకే సమయంలో మాట్లాడుతూ ప్రిన్సిపాలు అవధానం చేస్తున్నాడు. అయ్యేయెస్ ఆఫీసరు యెవరితోనో కబుర్లు చెబుతున్నాడు.

కృష్ణవేణి వెనుదిరిగి చూసింది.

జనానికి బాగా దూరంగా, ఖాళీగా వున్న కుర్చీల సముదాయం మధ్య, వో కుర్చీలో అటువైపుకు తిరిగి కూర్చున్న ప్రొఫెసరుగారు కనిపించారు. లేచి అటు వైపుకు నడచింది.

"నమస్తే సార్" అంటూ చేతులు జోడించింది.

"నమస్తే, నమస్తే...నువ్వు, నువ్వు..."

"నేనండి. కృష్ణవేణిని...సెవెంటీ ఫైవ్‌లో మీ దగ్గర చదువుకున్నాను..."

"కృష్ణవేణి...కృష్ణవేణి...అవునమ్మా! జ్ఞాపకం వుంది...బాగా మార్పొచ్చింది నీలో...కూచోమ్మా... యెలావున్నావ్?"

"బావున్నానండీ..."

కాస్సేపు మౌనంగా వుండిపోయిన తరువాత, "మీ పిల్లలు కూడా యిక్కడే చదువుతున్నారా కృష్ణవేణీ?" అంటూ ప్రశ్నించాడు ఆయన.

కృష్ణవేణి సైతం వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. మెల్లమెల్లగా మాటల్ని కూడబలుక్కుంటూ "మీ ప్రశ్న 'యూ టూ బ్రూటస్?'— లా వినిపించింది సార్" అంది.

కాస్సేపు మౌనంగా వుండిపోయిన తరువాత "అన్నట్టు మీ పెళ్లికి నువ్విన్విటేషన్ పంపావు గదూ! చాలా రోజులైపోయింది... నేను శుభాకాంక్షలు కూడా పంపినట్టు గుర్తు..." అన్నాడు ఆయన.

"అవును సార్...నాకు సరిగ్గా పెళ్ళి పీటలపైనున్నప్పుడే అందింది మీ టెలిగ్రామ్..."

"నాకు కొన్ని విషయాలు యెందుకో గుర్తుండవమ్మా! యెప్పుడో నిన్ను యెందుకో మందలించినట్టు జ్ఞాపకం...నిజమేనా?"

"భలేవారే సార్! మీకు అన్నీ బాగా గుర్తుండే


# జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్‌క్రీమ్, మీ వ్యక్తిత్వానికి కొత్త అందం తెచ్చేందుకు ప్రత్యేకంగా తయారు చేయబడింది. జిడ్డుగా ఉండని ఈ క్రీమ్, మీ జుట్టుకి కొత్త రూపు సమకూర్చి రోజం పొందికగా ఉండేలా చేస్తుంది.




బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్ మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.

ఫ...టాయి. ఆరోజుల్లో మేమంతా మీ జ్ఞాపకశక్తిని గురించే మాటాడుకునేవాళ్ళం......"

"నేనూ పెద్దవాడినై పోతున్నానుగదా కృష్ణవేణీ!" ఆయన నవ్వేశాడు. "అయితే, నేనలా కేకలేసిన తరువాత, మళ్లీ యేమీ జరిగినట్టులేదు. అంతటితో ఆ గొడవ సద్దుమణిగి పోయింది...అంతేగదూ?"

కృష్ణవేణి తల వూపింది. "కానీ సర్, నా పెళ్ళి జరిగింది ఆ యింజనీరింగ్ స్టూడెంట్‌తోనే!"

"వెరీగుడ్...అలాగా? దట్స్‌గుడ్...యువార్ సక్సీడెడ్..." ఆయన తెరలుతెరలుగా నవ్వేశాడు.

"నో, యిటీజ్ నాట్ మై సక్సెస్..."

ఆయన కుతూహలంగా చూశారు.

"బుద్ధిగా చదువుకుంటున్న నన్నలా గొడవ చేసిందీ, పట్టుబట్టి పెళ్ళి చేసుకున్నదీ ఆయనే!..."

"భలేదానివే అమ్మాయ్!" ఆయన మళ్లీ నవ్వేశాడు.

"నిజం సార్ ఆయనే వాళ్ళ అమ్మా, నాన్నల్ని మాయింటికి పంపి యీ సంబంధం ఖాయం అయేలా చూశారు. మా నాన్నగారు యెలిమెంటరీ స్కూలు టీచరు. కోరి పెద్ద కంట్రాక్టరు కోడల్ని చేసుకుంటానంటే యేమంటారు చెప్పండి? ఆయన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను..."

"అయితే నీ పెళ్లి నీ యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే జరిగిపోయిందంటావా కృష్ణవేణీ?" ఆయన విస్తుపోయాడు.

"అబ్బే, నేనలా అనలేదండీ! ఆ గొడవలో నాది కేవలం తటస్థమైన పాత్ర మాత్రమేనని చెబుతున్నానంతే! ఆ వేళ మీ గదిలో మీకు యీమాట చెప్పాలని ప్రయత్నించాను. కుదర్లేదు" ఆమె కూడా నవ్వేసింది.

యువకుడొకడు రెండు కూల్ డ్రింక్స్ తీసుకొచ్చి, యిద్దరికీ అందించాడు.

ప్రొఫెసర్‌గారు కూల్‌డ్రింక్ తాగసాగాడు.

కృష్ణవేణి మానస సాగరంలో యేవేవో తరంగాలు చెలరేగసాగాయి. భాస్కర్‌తోతన వివాహమూ, యుగమొక క్షణంలా గడచిన తమ హనీమూన్, ...తన పుట్టింటికి పూర్తిగా విరుద్ధంగా కుదిరిన అత్తవారిల్లూ... కాంట్రాక్టులకోసం అడ్డమైన తిరుగుళ్లూ తిరిగే మామగారూ, స్టేటస్ కోసం ఆరాటపడే అత్తగారూ... కావ్య తన జీవితంలోకి ప్రవేశించడమూ, మెల్లమెల్లగా ...స్కర్ వ్యాపారాల వూబిలోకి ...రుకోవడమూ...క్షణక్షణమూ తాను వొంటరి ...న్నయిపోతున్నానని బాధపడడమూ... ఆమె కళ్ళు ...న్నీళ్లతో నిండిపోయాయి. భోరుమని యేడవాలన్న ...రిక ఆమెను చాలా రోజులుగా వేధిస్తోంది. ...రణమేమిటోతనకే పూర్తిగా అవగతం కాని యీ ...ధను యెవరితో చెప్పుకోవాలి? యెలా చెప్పుకోవాలి? ...న బాధను యెవరు అర్థం చేసుకోగలరు? సానుభూతి ...గాపేవారెవరు?

స్టేజీపైన యేవేవో ప్రదర్శనలు కొనసాగు న్నాయి.

"నెక్స్ట్ ప్రోగ్రాం యీజ్ కుచేలా అండ్ హిస్ ...వ్..." —'అనౌన్సుమెంటు' వినిపించింది.

తెర తొలగింది. కుచేలుడూ, అతడి భార్యా యింగ్లీషులో పోట్లాడుకుంటున్నారు. బిలబిలమంటూ ...తగాడి గంపెడు సంతానమూ రంగంపైకి దుమికారు.

"అదిగదిగో, ఆ పిల్లల్లో మా అమ్మాయి గూడా వుంది సార్" చాలాసేపటి తరువాత, కృష్ణవేణిలో వుత్సాహం తొంగి చూసింది.

ప్రొఫెసరుగారు చిరునవ్వునవ్వాడు.

"ఆ అమ్మాయి సార్...వెనగ్గా, నాలుగో వరుసలో మూడో పిల్ల...ఆ అమ్మాయే...కావ్య..."

"డొనేషన్ యెంత కట్టారు?" బాణంలా దూసుకొచ్చింది ప్రశ్న.

కృష్ణవేణి వులిక్కిపడింది.

"నాకు తెలియదండీ...వాళ్ల నాన్నగారుచేర్పించి వెళ్లారు......"

"........."

"నాకయితే యిష్టంలేదు సార్...కానీ..."

"బాధపడకమ్మాయ్! నిన్నేమీ అనడం లేదు నేను...యిందుకెవర్ని నిందించాలో నాకింకా అర్థం కావడం లేదు....నేనింగ్లీషు ప్రొఫెసర్ని! అందుకు

**ఆశలు**

నా ఆశలు
నిత్యనూతనం...
అజరామరం!
పుట్టుకతోనే
ఫార్మలిన్‌లో ముంచి
మ్యూజియంలో
భద్రపరిచేశాగా!!

—సూర్యప్రసాదరావు

నేనెప్పుడూ పొంగిపోలేదు. అయితే యింగ్లీషు సాహిత్యంలాంటి వుత్తమ సాహిత్యాన్ని చదువుకునే అవకాశం దొరికినందుకు ఆనందిస్తున్నాను..."

"........."

"నేను తెలుగువాణ్ణి! ఆ మాట యెలా మరచిపోగలను? మై రూట్స్ ఆర్ యిన్ యిట్...తెలుగు వచ్చినవాడితో నేనెందుకు యింగ్లీషులో మాట్లాడాలి? తెలుగు నాకు సహజంగా వచ్చింది. యింగ్లీషు కల్టివేట్ చేసుకుంటే వచ్చింది. అయినో యింగ్లీష్. హౌకెన్ డినై యిట్?

కానీ నాతోటి తెలుగు వాడితో నేను తెలుగులోనే మాట్లాడుతాను. నేనీ జాడ్యం పట్టిన వాళ్లని చూసి జాలిపడ్డంలేదు. యింగ్లీషు కీగతి పట్టినందుకు, ఆ భాషను చూసి జాలిపడుతున్నాను. ఆ ప్రిన్సిపాల్నెలాగైనా యేడవనను. పిల్లల్నెందుకిలా యేడిపిస్తాడు. నాలుగైదేళ్ల పిల్లలు యింగ్లీషెలా మాట్లాడగలరు చెప్పు? పై పెచ్చు తెలుగులో మాట్లాడితే 'పనిష్‌మెంట్' యిస్తానంటాడు. తన డిసిప్లెయిన్ చూసి, మనల్ని మెచ్చుకోమంటాడు. తెలుగులో ఆలోచన, యింగ్లీషులో వ్యక్తీకరణ...పసిపిల్లల కెందుకీ బాధ? మొక్కల్ని నేలపైన పాతితే బ్రతుకుతాయి. రాళ్లపైన నాటితే యెలా బ్రతుకుతాయి?"

"........."

"తెలివైనవాడు. పర్వెర్టెడ్ జీనియస్... బాగా డిమాండు వున్న వ్యాపారం యెంచుకున్నాడు. ఫండ్సూ, డొనేషన్లూ...తప్పుల తడకగా యింగ్లీషులో మాట్లాడడం మన సంస్కారం. తెలుగులో మాట్లాడడం అనాగరికత. అది మనవాళ్ల నమ్మకం. ఆ విషయం యీ ప్రిన్సిపాల్ పసిగట్టాడు. యీ వ్యాపారం మొదలుపెట్టాడు. మీరంతా తనని మెచ్చుకోవాలనీ, తన వుచ్చులో మరింత మంది తగులుకోవాలనీ అతగాడు పడుతున్నపాట్లు గమనించావా నువ్వు? యీ వుచ్చులో తల నెరిసినా బుద్ధిరాని యీ పెద్దవాళ్ళు పడితే నాకేం బాధగాలేదు. కానీ యీ పసివాళ్ల గతేమిటి?"

"........."

"నేనేదో మంచిపని చేస్తున్నాననుకొని, పిల్లలకు నాలుగు మంచిమాటలు చెబుదామనుకొని యీపని కొప్పుకున్నాను. తీరా వస్తే నన్నుగూడా వొక 'షో పీస్'గా తయారుచేసి తన పబ్బం గడుపుకుంటున్నాడీ కర్కోటకుడు. నేనెక్కడ తెలుగులో వుపన్యసిస్తానోనని భయపడి, యింగ్లీషులో ప్రసంగించ బోతున్నానంటూ అనౌన్సు చేసేశాడు..."

కాసేపు మౌనంగా కూర్చున్న తరువాత, ప్రొఫెసరుగారు పైకి లేచారు.

"నేను వెళ్తానమ్మా! యీ రాత్రికే యింటికెళ్లిపోవాలి. యిక్కడుండలేను..."

కృష్ణవేణి పైకి లేచి, నమస్కరించింది.

కాస్త దూరం నడిచాక, మళ్లీ వెనక్కి తిరిగొచ్చాడు ఆయన, "యేదో ఆవేశంలో మాట్లాడేశాను. మరోలా అనుకోకు కృష్ణవేణీ!...పెద్దవాడ్నయిపోతున్నాను గదా!...... మీ పాపాయికి నా శుభాకాంక్షలు చెప్పు" యీసారి ఆయన తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

కృష్ణవేణి కుర్చీలో కూలబడిపోయింది.

స్టేజీపైన యేదో గ్రూప్ డాన్సు సాగుతోంది.

వినోద కార్యక్రమాల అనంతరం 'బఫే' వుందని ప్రిన్సిపాల్ మళ్లీ మళ్లీ హెచ్చరిస్తున్నాడు.

తమ వేషాలపని ముగియడంతో, గ్రీన్‌రూంలోంచి పిల్లలలాగే తమ తమ తల్లిదండ్రుల దగ్గరికి పరిగెత్తుకొస్తున్నారు.

"మమ్మీ...మమ్మీ...హౌవ్వా సీన్ మై డ్రామా?" కావ్య చీర కుచ్చిళ్ల పట్టిలాగుతోంది.

కృష్ణవేణి పాపాయినలాగే వొళ్లోకి లాక్కుంది.

కావ్య యేదేదో చెబుతోంది.

ఆమె పరధ్యానంగా వూ కొట్టసాగింది...

"మమ్మీ! హౌయీజ్ గ్రానీ...షీ సేస్ దట్ మమ్మీ యీజ్......"

"చూడు కవీ!..." పాపాయిని వొళ్లోనుంచీ కిందికి దింపి, నిల్చోబెట్టి, సూటిగా కళ్లల్లోకి చూస్తూ అంది కృష్ణవేణి— "నన్నిక 'మమ్మీ' అని పిలవకు......అమ్మా అని పిలువ్......"

కావ్య వొక నిముషంసేపు తల్లి నేపు అయోమయంగా చూసింది.

తరువాత మెల్లగా ప్రశ్నించింది—

"అమ్మా అంటే యేమిటి మమ్మీ?..." ●